ప్రజాపాలన కేంద్రాలకు నేడు,రేపు సెలవు

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డినగర్ డివిజన్‌లో 2,645, సుభాష్‌నగర్ డివిజన్‌లో 5,753, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో 4,372, జీడిమెట్ల డివిజన్‌లో 2,208 మొత్తం 14,978 దరఖాస్తుల అందాయి. అదే విధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం డివిజన్‌లో 3,681, జగద్గిరిగుట్ట డివిజన్‌లో 3,813, చింతల్ డివిజన్‌లో 2,716, సూరారం కాలనీ డివిజన్‌లో 3,354 మొత్తం 13,564 దరఖాస్తులు ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆది, సోమవారాలు సెలవు దినాలు కావడంతో తిరిగి జనవరి 2వ తేదిన దరఖాస్తుల జారీ, స్వీకరణ ఉంటుందని అధికారులు తెలిపారు.



కొంపల్లిలో దరఖాస్తులు అందజేస్తున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ హరిచందన

ప్రజాపాలనలో.. క్యూ పద్ధతిని పాటించాలి

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ హరిచందన



సూరారం కాలనీలో కేంద్రం వద్ద దరఖాస్తులను నింపుతూ..

కుత్బుల్లాపూర్: కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు క్యూ పద్ధతిని పాటించి ప్రజాపాలనలో దరఖాస్తులు అందజేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ హరిచందన అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపల్ పరిధిలోని 3వ, 18వ వార్డు కార్యాలయాలను హరిచందనతో పాటు అదనపు డైరెక్టర్ జాన్ శాంసన్‌లు సందర్శించి అభయ హస్తం దరఖాస్తుల జారీ, స్వీకరణలను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా క్యూ లైన్లలో నిలుచున్న ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్న ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్లు చింతల రవీందర్, డప్పు కిరణ్, సిబ్బంది ఉన్నారు.

◆ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని కేంద్రాల వద్ద శనివారం సైతం భారీ క్యూలైన్‌లు కనిపించాయి.



ప్రగతినగర్ 2వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

ఉదయం నుండే ప్రజలు దరఖాస్తులు తీసుకునేందుకు, పూరించిన పామ్‌లను ఇచ్చేందుకు ఆయా ప్రాంతాల్లోని కేంద్రాలకు చేరుకున్నారు. ధరఖాస్తు నింపేందుకు ఇబ్బంది పడ్డ పలువురికి సిబ్బంది దగ్గరుండి నింపించి వాటిని స్వీకరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కుత్బుల్లాపూర్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అనుమతులు తీసుకోకుండా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేట్‌బషీరాబాద్ సీఐ ప్రశాంత్ హెచ్చరించారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా పలు ఆంక్షలను విధించారు. వేడుకల సందర్భంగా బార్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు, ఫాంహౌజ్‌లు, ఇతర ప్రాంతాల్లో పోలీసుల అనుమతులు తీసుకోకుండా లైవ్ మ్యూజిక్ ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బుక్ మై షో, స్వయంగా ముద్రించి టికెట్లు విక్రయించే వారిని సైతం వదిలిపెట్టమన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారితో పాటు వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో ఈ నెల 31వ తేది రాత్రి ఆరు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహిస్తామని, రోడ్లపై కేకులు కట్ చేయవద్దని సూచించారు. దుకాణదారులు సైతం సమయ పాలన పాటించాలని, అర్ధరాత్రి ఒంటి గంట వరకు వేడుకలను ముగించాలని సూచించారు. ప్రధాన రహదారుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, తమ సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తారని, ప్రజలు పోలీసులకు సహకరించాలని, ప్రశాంతకరమైన వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని సీఐ ప్రశాంత్ కోరారు.



సీఐ ప్రశాంత్..

ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైన యశస్విని

బాలానగర్: ఢిల్లీలో జనవరిలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపుకు ఎంపికైన మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జాతీయ సేవా పథకం వలంటీర్ గుగ్లావత్ శశస్వినిని జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మంజూర్ హుస్సేన్‌లు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా తమ యూనివర్సిటీ తరపున యశస్విని రిపబ్లిక్ డేకి అర్హత సాధించటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజలతో మమేకమై పనిచేయాలి



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్: పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులంతా ప్రజలతో మమేకమై పని చేస్తే అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 5.45 కోట్లతో నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలను అందిస్తానన్నారు. పార్టీలకతీతంగా అందరినీ కలుపుకుని అభివృద్ధి పనులను చేసుకోవాలని సూచించారు. అనంతరం హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన వివేకానంద్‌ను గజమాలతో కౌనిలర్లు, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మారావు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, తహశిల్దార్ సుచరిత, మేనేజర్ నర్సింహులు, రెవెన్యూ అధికారి సునంద, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెక్కుల అందజేత..

గండిమైసమ్మ–దుండిగల్ మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలో 18 మందికి ఎమ్మెల్యే వివేకానంద్ రూ.19 లక్షల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహశిల్దార్ సుచరిత, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



జీడిమెట్ల: గుర్తుతెలియని మృతదేహం లభించిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సతీష్ రెడ్డి వివరాల ప్రకారం.. గురువారం ఉదయం చింతల్ ప్రధాన రహదారిలోని కేఎఫ్‌సి ఫుడ్‌స్టాల్ సమీపంలోని పుట్‌ఫాత్‌పై గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా మృతదేహం వద్ద ఎలాంటి అనవాళ్లు లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ అస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుని వయస్సు 65సంవత్సరాలు ఉంటుందని కుటీంబీకులు ఎవరైనా గుర్తిస్తే జీడిమెట్ల పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇంటి తాళాల అందజేత

సుభాష్‌నగర్: నగరంలో సొంత గూడు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి కల నిజమైంది. పేద మధ్యతరగతి ప్రజల కోసం గత ప్రభుత్వం కట్టించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను సెప్టెంబర్ నెలలో గత ప్రభుత్వం అర్హుల జాబితాను విడుదల చేసి ఒకరిద్దరికి పంపిణీ చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పంపిణీ నిలిపేశారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చిన లబ్ధిదారులకు వాటి తాళాలను పంపిణీ చేసే ప్రక్రియను చేపట్టారు. శనివారం గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్ లోని నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ల ను హౌసింగ్ ఏఈ కరుణాకర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. ముందుగా వారి ఆధార్ కార్డు సహాయంతో వారికి తాళాలు అందించి వారి ఇళ్లను చూపించారు.

రేపు త్యాగరాజుస్వామి ఆరాధనోత్సవం

సనత్‌నగర్: మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 1న 176వ త్యాగరాజుస్వామి వారి ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నట్లు కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీఎస్‌టీ శాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్లో సోమవారం సాయంత్రం 5.30 గంటలకు నర్తనశాల డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరిస్తాం

కుత్బుల్లాపూర్: స్థానికంగా నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి పరిష్కరిస్తున్నారని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహా రెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్ గ్రామంలో అండర్ డ్రైనేజీ సమస్యను స్థానికులు ఆయనకు వివరించగా స్థానికంగా పర్యటించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారికి సూచించారు. త్వరలోనే మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నార్లకంటి దుర్గయ్య, కృష్ణ, నార్లకంటి ప్రతాప్, సాయి తదితరులు ఉన్నారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న చెరుకుపల్లి భరతసింహారెడ్డి..

బఫర్ జోన్‌లో నిర్మాణాన్ని అడ్డుకున్న స్థానికులు



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు.. సర్కిల్‌లో గతంలో అధికారులు కూల్చివేసిన పిల్లర్

సుభాష్‌నగర్: చెరువు కట్టను అనుకొని బఫర్ జోన్ లో ఓ వ్యక్తి కడుతున్న నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. గాజుల రామారావు డివిజన్ మోక్షిత్ హిల్ వ్యూ కాలనీలోని సర్వే నంబర్ 445 లో చింతలచెరువు కట్ట కింద నిరిమ్తస్తున్న నిర్మాణాన్ని గతంలో అధికారులు కూల్చివేశారు. ఓ వ్యక్తి తాజాగా నాకు ఎన్ఓసీ ఉందంటూ నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు గతంలో అభ్యంతరం తెలిపిన అధికారులు ఇప్పుడు ఎలా ఇస్తారంటూ ప్రశ్నించారు. దీంతో నిర్మాణదారుడు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సదరు స్థలాన్ని పరిశీలించారు. ఇరువురిని స్టేషన్‌కు రావాలని పోలీసులు ఆదేశించారు. కొన్ని సంవత్సరాల నుంచి అక్కడ చిన్నగా కట్ట మైసమ్మ విగ్రహం ఉండేదని, ప్రస్తుతం అక్కడ ఆలయ నిర్మాణం చేపడతామని గ్రామస్తులు చెబుతున్నారు.

మురుగు సమస్యను పరిశీలించిన జీఎం



మురుగును పరిశీలిస్తున్న జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: కొన్ని నెలలుగా ఏరులై పారుతున్న మురుగునీటి విషయమై జలమండలి అధికారులు స్పందించారు. సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ వద్ద నిత్యం మురుగు నీరు రోడ్డుపైకి చేరుతుండటంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా దుర్గంధం పేరుకుపోవడంతో సమీప కాలనీల ప్రజలకు దోమల బెడద తప్పడం లేదు. దీనిపై స్థానికుల నుండి ఫిర్యాదులు అందుకున్న కుత్బుల్లాపూర్ జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి శనివారం డీజీఎం రాజేష్, మేనేజర్ రాజులతో కలిసి స్థానికంగా పర్యటించి సమస్యను పరిశీలించారు. మురుగునీరు లీకవుతున్న ప్రాంతంలో పైపులైన్‌లు వేసి శాశ్వత ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని జీఎం శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు.

బేకరీల్లో సరికొత్త కేకులు

మూసాపేట: నూతన సంవత్సర వేడుకలకు మూసాపేటలోని పలు బేకరీల్లో కేక్‌లు తయారు చేస్తున్నారు.కేకులు కట్‌చేసి పాత నంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇందు కోనం బేకరీల్లో సరికొత్తగా కేక్‌లు అందించనున్నాము, మామూలు రోజుల కన్నా తక్కువ ధరకే కేకులు అందిస్తున్నారు. మరి కొందరు కాంబోలు కూల్ డ్రింక్స్ ఇస్తున్నారు.

ఉత్సాహంగా హ్యాకథాన్



దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గత మూడు రోజులుగా హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఆర్ఐటీకి చెందిన కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగాలు బ్రెయిన్ ఓ విజన్ సహకారంతో 'జిజ్ఞాస 2323' పేరుతో నిర్వహించింది. ఇందులో రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన సుమారు 370 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. పైథాన్ ఫుల్ స్టాక్, డేటా సైన్స్, ఎంఎల్ డొమైన/ , స్టార్ట్ అప్ తక్కువ కోడింగ్ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ మర్రి శ్రేయరెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ రావు, ఐబీఎం అసోసియేట్ డైరెక్టర్ రవిరాం కుమార్, డీన్ రాధికాదేవి, హెచ్ఓడి బలరాం, గణేశ్ నాగ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న సిడిఎంఏ హరిచందన

దుండిగల్: అర్హులైన ప్రతి ఒక్కరూ అభయ హస్తం ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ హరిచందన దాసరి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లి, డి.పోచంపల్లి ప్రాంతాల్లో శనివారం ఆమె పర్యటించారు. అభయ హస్తం దరఖాస్తుల కార్యక్రమ సరళిని పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, దరఖాస్తులను అధిక ధరలకు విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలని హరిచందన ఆదేశించారు. ఆమె వెంట అడిషనల్ డైరెక్టర్ జాన్ శాంసంగ్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, తహశీల్దార్ సుచరిత ఉన్నారు.

అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి



బాచుపల్లిలో అభయ హస్తం ధరఖాస్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ హరిచందన

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ హరిచందన అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధి 15, 17, 19 డివిజన్లలో అడిషన్ డైరెక్టర్ శాంసన్, మేయర్ నీలా రెడ్డిలతో కలిసి పర్యటించిన ఆమె అభయ హస్తం ధరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడుతూ జనవరి 6వ తేది వరకు అభయహస్తం ధరఖాస్తులను స్వీకరిస్తామని, తదుపరి కూడా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం కొనసాగించేలా ఆలోచనలో ఉందన్నారు. కార్పొరేటర్లు గాజుల సుజాత, ఆగం రాజుముదిరాజ్, అధికారులు చంద్రప్రకాష్, సుకృత తదితరులు ఉన్నారు.

ఈ మార్గం ప్రమాదకరం

నిజాంపేట్: నాలాపై కల్వర్ట్ నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారింది.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని సాయినగర్ నుండి తుర్క చెరువు వరకు ఉన్న నాలాపై కల్వర్ట్‌ను చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారింది.. చుట్టు పక్కల కాలనీలు, బస్తీలు వెలిసిన నేపథ్యంలో నాలా పైనుండి దాటే క్రమంలో పలువురు అందులో పడిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కల్వర్ట్ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



సాయినగర్- తుర్క చెరువు వెళ్లే నాలాపై కల్వర్ట్ లేకపోవడంతో ప్రమాదకరంగా

సందడి చేసిన విద్యార్థులు




నిజాంపేట్: భౌరంపేట్‌లోని గీతాంజలి ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నూతన సంవత్సరానికి స్వాగత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంప్ ఫైర్‌లో ×చెడు అలవాట్లను విడిచి పెట్టాలి¥ అని కోరుతూ కాగితంపై రాసి మంటల్లో వేసి, చుట్టు తిరుగుతూ నృత్యాలు చేశారు. పాత సంవత్సరంలో జరిగిన చెడు తొలగిపోయి కొత్త సంవత్సరంలో విద్యార్థులకు అన్ని శుభాలే జరగాలనే ఉద్దేశంతో క్యాంప్ ఫైర్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి పేర్కొన్నారు.

దుమ్ము సమస్యకు నీటితో చెక్



సుభాష్‌నగర్: సుచిత్ర నుండి కొంపల్లి వెళ్లే 44 జాతీయ రహదారి లో వాహనాల రద్దీతో గత కొన్ని నెలలుగా ఫ్లైఓవర్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. పనులు జరుగుతున్న నేపథ్యంలో కొన్నిచోట్ల వాహనాలను సర్వీస్ రోడ్డు మీదుగా మళ్లించారు. వాహనాలు రాకపోకలు సాగించినప్పుడు దుమ్ము ఎగిసి పడకుండా ట్రాఫిక్ పోలీసులు ఉదయం సాయంత్రం వేళలో నీటిని పట్టిస్తున్నారు.

నాలాలో వ్యర్థాలు వేస్తున్న వ్యక్తిపై కేసు



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ట్యాంకర్..

జీడిమెట్ల: గుట్టు చప్పుడు కాకుండా నాలాలో వ్యర్థ రసాయనాలను డంపింగ్ చేస్తున్న ట్యాంకర్‌ను బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. గాగిల్లాపూర్‌కు చెందిన సురేష్‌నాయక్ అనే వ్యక్తి ట్యాంకర్ నెంబర్ (టీఎస్12యూడీ 6684)లో చౌటుప్పల్ ప్రాంతం నుండి రసాయనాలను తీసుకువచ్చి జీడిమెట్ల పారిశ్రామికవాడలో డంప్ చేస్తుంటాడు. అదేవిదంగా శుక్రవారం రాత్రి సురేష్ నాయక్ చౌటుప్పల్ నుండి వ్యర్థ రసాయనాలను తీసుకువచ్చి షాపూర్‌నగర్ నుండి జగద్గిరిగుట్ట వెళ్లే దారిలోని పైప్‌లైన్‌రోడ్డులో డంప్ చేస్తుండగా బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ట్యాంకర్‌ను జీడిమెట్ల పోలీసులకు హ్యాండ్‌ఓవర్ చేయగా ఇన్స్‌పెక్టర్ పవన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్!

ఇప్పటివరకు పేరుకుపోయిన బకాయిలు, పన్నులపై దృష్టి

- ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల లక్ష్యం రూ.202 కోట్లు
- ఇప్పటి వరకు పన్ను వసూలైంది.. 60 శాతం మాత్రమే..
- ప్రజాపాలన ముగియగానే స్పెషల్ డ్రైవ్‌తో రంగంలోకి బృందాలు
- మూడు నెలల్లో వంద శాతం లక్ష్యంపై కార్యాచరణ ప్రణాళిక

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో పాత బకాయిలతో పాటు వంద శాతం పన్నుల వసూళ్లపై కార్యాచరణ ప్రణాళికపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. వచ్చే మార్చితో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో లక్ష్యాన్ని అధిగమించేందుకు పురపాలక సంఘాలు, జీపీలు ప్రత్యేక డ్రైవ్‌పై దృష్టి సారిస్తున్నాయి. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపడం ద్వారా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళలో ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని భావిస్తోంది. మూడు నెలలు మాత్రమే గడువు ఉండటంతో.. ప్రజాపాలన కార్యక్రమం ముగిసిన తర్వాత బృందాలను రంగంలోకి దింపి, ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల కారణంగా దాదాపు మూడు నెలలు పన్నుల వసూళ్లకు బ్రేక్ పడింది. త్వరలో పార్లమెంట్, పంచాయతీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో.. పట్టణాలు, జీపీల్లో పన్నుల వసూళ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. లేనిపక్షంలో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడే అవకాశం లేకపోలేదని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పన్నుల లక్ష్యం చేరుకునేందుకు శతవిధాలా ప్రయత్నించాలని భావిస్తోంది.

పన్నుల లక్ష్యం రూ.202 కోట్లు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాలతో పాటు 61 గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.202 కోట్లు కాగా, ఇప్పటి వరకు 60 శాతం పన్నుల వసూళ్లు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల కారణంగా మూడు నెలలు పన్నుల వసూళ్లకు పుల్‌స్టాప్ పడగా, వచ్చే మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. ఆలోగా వంద శాతం పన్నుల వసూళ్ల ప్రత్యేక డ్రైవ్‌కు అధికార యంత్రాంగం మొగ్గు చూపుతోంది. మార్చి 31 వరకు పన్ను చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు ఇవ్వగా, ఆ తర్వాత చెల్లించిన వారికి రెండు శాతం చొప్పున పన్నుపై వడ్డీ విధిస్తారు. పట్టణాలు, జీపీల్లో ప్రైవేట్ ఆస్తుల పన్నులు సకాలంలో వసూలవుతున్నా.. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నులు మాత్రం ఏటేటా పెరిగిపోతున్నాయి.

పేరుకుపోయిన వాటితో కష్టాలు..

పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో ఏటా సకాలంలో పన్నులు వసూలు కావడం లేదు. రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోతుండటంతో అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేక్ పడుతోంది. దీనికితోడు పురపాలక సంఘాలు, జీపీల్లో పనిచేస్తున్న సిబ్బంది జీతభత్యాలు కూడా సకాలంలో చెల్లించలేని దుస్థితి ఏర్పడుతోంది. అలాంటి పరిస్థితుల నుంచి పట్టణాలు, జీపీలు అధిగమించాలంటే పన్నులు సకాలంలో వసూలు కావాల్సిన అవసరం ఉంది.